## క్లుప్తంగా

### నేడు కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన

**డాబాగార్డెన్స్:** ఉత్తరాంధ్ర కల్పవల్లి, విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తారు.

### ప్రజా వినతులకు తక్షణ పరిష్కారం



అర్జీలు పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ రాజు

**కంచరపాలెం:** జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్-5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 5 వినతులు అందాయి. అర్జీదారుల నుంచి వాటిని జోనల్ సూపరింటెండెంట్ టి.ఎస్.ఎస్.రాజు స్వీకరించి పరిశీలించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి 1, పబ్లిక్ హెల్త్‌కు 1, ఇంజినీరింగ్‌కు 3 చొప్పున అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. ప్రజా వినతులను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. అనంతరం ఆయా విభాగాధికారులకు వినతిపత్రాలను అందజేశారు.

### చురుగ్గా రైల్వే రక్షణ గోడ నిర్మాణ పనులు



రక్షణ గోడ నిర్మాణ పనుల్లో కార్మికులు

**కంచరపాలెం:** కంచరపాలెం నుంచి మర్రిపాలెం వరకు రైల్వే రక్షణ గోడల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయి. ఇటీవల వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు అద్దాలను ఆకతాయిలు రాళ్లతో పగులగొట్టిన ఘటనతో ఈ చర్యలు తీసుకున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట, గవర కంచరపాలెం, గొల్లకంచరపాలెం ప్రాంతాలకు ఆనుకుని ఉన్న రైల్వే రక్షణగోడ నిర్మాణ పనులను సోమవారం చేపట్టారు. ఈ సందర్భంగా రైల్వే ట్రాక్‌ల నుంచి పాదచారులు నడవకుండా చర్యలు తీసుకోవడంతో పాదచారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్ వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

### ప్రముఖ న్యాయవాది ఉమాబాల అస్తమయం

**విశాఖ, లీగల్ :** తొలితరం ప్రముఖ మహిళా న్యాయవాది పి. ఉమాబాల కన్ను మూశారు. ఆమె అంత్యక్రియలు బుధవారం జరుగుతాయి. నగరానికి చెందిన ఉమాబాల ప్రముఖ దివంగత న్యాయవాది పోలిశెట్టి మాధవరావు నాయుడు దంపతులకు 1932 సెప్టెంబర్ 16న జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్రం చదివి న్యాయవాదిగా ప్రస్థానం ప్రారంభించారు. తండ్రి దగ్గర న్యాయవాది వృత్తిలో మెలకువలు నేర్చుకున్నారు.1954లో న్యాయవాదిగా కోర్టులో అడుగు పెట్టారు. 60 ఏళ్లకు పైగా వృత్తిని కొనసాగించి ఎందరికో మార్గదర్శిగా నిలిచారు. భర్త పోలిశెట్టి శ్రీనివాసరావు కూడా న్యాయవాది. ప్రభుత్వ న్యాయవాదిగా 15 సంవత్సరాలు పని చేశారు. విశాఖ మున్సిపాలిటీకి 3 సార్లు కౌన్సిలర్‌గా ఎన్నికయ్యారు. విశాఖ స్టీల్ ప్లాంట్ భూముల సేకరణలో లోక్ అదాలత్ సభ్యురాలిగా పని చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం 131 ఏళ్ల చరిత్రలో ఇప్పటి వరకు ఏకైక మహిళా అధ్యక్షురాలు ఉమాబాల మాత్రమే. ఆమె మృతి పట్ల న్యాయవాదులు, న్యాయమూర్తులు సంతాపం ప్రకటించారు.



# నేడు ఎల్లమ్మ తొలేళ్లు.. రేపు జాతర

**డాబాగార్డెన్స్:** భక్తులు కొంగుబంగారంగా కొలుచుకునే ఎల్లమ్మ వార్షిక జాతర మంగళ, బుధవారాల్లో పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. మహా శివరాత్రి తర్వాత తొమ్మిదో రోజు మృగశిర నక్షత్రాన అమ్మవారి పండగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. మంగళవారం అర్ధరాత్రి దాటిన తర్వాత వన్‌టౌన్ పప్పులవీధి, జిల్లేడుమూడి వారి వీధిలో జొన్నాడ గురుమూర్తి ఇంట్లో ఉన్న చదునుపట్టు వద్ద ఎల్లమ్మకు, సోదరుడు పోతురాజుకు పప్పు, బియ్యం, ఉలవలతో ఉపారం పెడతారు. అక్కడి నుంచి బాణసంచా, మేళతాళాల మధ్య అమ్మవారిని ఊరేగింపుగా తీసుకొస్తారు. అనంతరం ఎల్లమ్మతోటలోని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ప్రత్యేక దర్శనాలు కల్పించనున్నట్టు ఆలయ ఈవో పద్మావతి తెలిపారు.



ఎల్లమ్మ.. సోదరుడు పోతురాజు

**ఏడుగురు అక్కచెల్లెళ్లకు ఒకే సోదరుడు..**

ఎల్లమ్మ, అనకాపల్లి నూకాలమ్మ, గంగాలమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, బంగారమ్మ, పోలమ్మ అమ్మవార్లకు పోతురాజు ఒక్కరే అన్నదమ్ముడు. ఎల్లమ్మతోటలోని అమ్మవారి దేవాలయానికి సమీపంలో పోతురాజు పుట్ట ఉంది. ఈ ఆలయానికి పోతురాజు పుట్టకు సొరంగ మార్గం ఉందని పూర్వీకులు చెబుతున్నారు. ఎల్లమ్మ పేరు మీదే ఈ ప్రాంతానికి ఎల్లమ్మతోట అనే పేరు వచ్చింది. ఆలయానికి 80 ఏళ్లకు పైగా చరిత్ర ఉందని పెద్దలంటారు.

**ఆలయ చరిత్ర..**

చిత్రాలయ థియేటర్ సమీపంలో కొన్నేళ్ల కిందట ఓ బావిలో ఎల్లమ్మవారు, సోదరుడు పోతురాజు విగ్రహాలు బయల్పడ్డాయి. విగ్రహాలను బయటికి తీసి, తోటలో ప్రతిష్ఠించారు. 1960లో సంభవించిన తుపానుకు ఆలయం కూలిపోయింది. అనంతరం నూతన ఆలయాన్ని నిర్మించారు. మహా శివరాత్రి పర్వదినం రోజున సముద్ర స్నానం చేసి ఎల్లమ్మ అమ్మ వారిని దర్శించుకుంటే సర్వ రోగాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

# సీతంరాజు సుధాకర్ గెలుపు కోరుతూ ప్రచారం



35వ వార్డులో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి



ఉపాధ్యాయులను అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ నారాయణరావు



వెంకటేశ్వరమెట్టపై సీతంరాజు తరఫున ప్రచారం చేస్తున్న గోపీకృష్ణ తదితరులు

**జగదాంబ :** పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీఎం జగన్ నిర్ణయించిన సీతంరాజు సుధాకర్‌కు మద్దతుగా సోమవారం విస్తృత ప్రచారం జరిగింది. 35వ వార్డులో శ్రీ దుర్గాలమ్మ అమ్మవారి దర్శనం అనంతరం కల్లు పాకలు, పండా వీధి, గాజుల వీధి, వెలంపేట, ఆర్ఆర్ రోడ్డు, పూర్ణామార్కెట్, ప్రసాద్ గార్డెన్స్, పందుంబుల్లల సందు, మేదరవీధి ఏరియాల్లో ఎమ్మెల్యే వాసుపల్లి పాల్గొని ప్రచారం చేశారు. స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ప్రతి పట్టభద్రుని ఇంటికీ వెళ్లారు. సీతంరాజు సుధాకర్ గెలిపించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం చైరపర్సన్ కొల్లి సింహాచలం, 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, ప్రెసిడెంట్ అలపన కనకరెడ్డి, పార్టీ నాయకులు ఆది విష్ణు, బొగ్గు శ్యామ్, నాయని మల్లిబాబు, మంగరాజు, సౌత్ మైనారిటీ సెల్ ప్రెసిడెంట్ ముజీబ్‌ఖాన్, ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ బోణి దేవా, బొడ్డేటి కిషోర్, ప్రసాద్, సచివాలయ కన్వీనర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**అల్లిపురం:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపీకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. దీంట్లో భాగంగా వార్డులో బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట ప్రాంతాల్లో కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ల ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పార్లమెంట్ జిల్లా కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్, ఆడారి వెంకట మహేష్, కణితి బ్రహ్మం, కొడమంచిలి శ్రీను, పిల్లి శివ, కృష్ణారెడ్డి, మహేష్ పాల్గొన్నారు.

**29వ వార్డులో..**

**దాబాగార్డెన్స్:** ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బరిలో నిలిచిన సీతంరాజు సుధాకర్ గెలుపునకు 29వ వార్డు కార్పొరేటర్ ఉరికిటి నారాయణరావు సోమవారం వార్డు పరిధిలో విస్తృత ప్రచారం చేపట్టారు. సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలంటూ దండుబజార్ ఎంవీడీ హైస్కూల్ ఉపాధ్యాయులను అభ్యర్థించారు. అలాగే వార్డు పరిధిలో పలు ప్రాంతాల్లో పర్యటిస్తూ గ్రాడ్యుయేషన్ ఓటర్లను కోరారు.

**కొణతాలను గెలిపించాలి**

వెనుకబడిన ఉత్తరాంధ్ర, గ్రాడ్యుయేట్ల సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన ఉత్తరాంధ్ర అభివృద్ధి సాధన వేదిక కన్వీనర్ కొణతాల వెంకట శ్రీనివాస్‌ను పట్టభద్రుల ఎన్నికల్లో మొదటి ప్రాధాన్యత ఇచ్చి గెలిపించాలని రిటైర్డ్ జిల్లా జడ్జి, సలహా కమిటీ చైర్మన్ బొడ్డేటి రామారావు విజ్ఞప్తి చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన కులాల అభివృద్ధికి కృషి చేస్తున్న కొణతాల శ్రీనివాస్‌ను తమ వర్గం తరఫున ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రతిపాదించామన్నారు. అభ్యర్థి కొణతాల శ్రీనివాస్ మాట్లాడుతూ స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లయినా ఉత్తరాంధ్ర ప్రాంతం ఇంకా వెనుకబడే ఉందన్నారు. ఉత్తరాంధ్రకు రావల్సిన నిధులు, పరిశ్రమలు, ప్యాకేజీలు, యువతకు ఉద్యోగావకాశాలపై తనని గెలిపిస్తే చట్టసభల్లో పోరాడుతానన్నారు. కార్యక్రమంలో కోటా రమేష్, ఉమామహేశ్వరరావు, సీహెచ్ వెంకటేశ్వరరావు, కొణతాల రాధ, అప్పలనరసమ్మ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కొణతాల శ్రీనివాస్

# చిన్నబోయిన రహదారి

- పేరుకే 30 అడుగుల రోడ్డు
- ఒక పక్క విద్యుత్ డీబీ బాక్సులు.. మరో పక్క డస్ట్‌బిన్‌లు
- చిరు వ్యాపారుల ఆక్రమణలతో ప్రయాణం నరకప్రాయం



గాంధీ బొమ్మ సమీపంలో రోడ్డు మధ్యలో డస్ట్‌బిన్ ఏర్పాటుతో కుంచించుకుపోయిన రహదారి



సింహాలదేవిడి వద్ద విద్యుత్ డీబీ బాక్సులు, డస్ట్‌బిన్ ఏర్పాటుతో ఇరుగ్గా మారిన రహదారి

**అల్లిపురం:** సౌత్ జైలురోడ్డు నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ వరకు 32, 33, 34 వార్డులకు అల్లిపురం మెయిన్‌రోడ్డు ముఖ్యమైనది. ఒక్క అల్లిపురం ప్రజలకే కాకుండా అక్కయ్యపాలెం, కంచరపాలెం, తాటిచెట్లపాలెం, నరసింహనగర్ ప్రాంతాల ప్రజలకు జగదాంబ, కేజీహెచ్‌కు వెళ్లేందుకు దగ్గరి దారి కూడా ఇదే. నిత్యం రద్దీగా ఉంటుంది ఈ దారి. అటువంటి రహదారి ఇప్పుడు ఆక్రమణలకు గురైంది. నిత్యం ట్రాఫిక్ జామ్‌లతో వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు గాని, ట్రాఫిక్ పోలీసులు గాని, జీవీఎంసీ అధికారులు గాని పట్టించుకోకపోవటంతో ఇక్కడ ఆక్రమణలు పెరిగిపోతున్నాయి.

**30 అడుగుల రోడ్డు..**
**మూడు మూరలు కూడా లేదు..**

ముప్పై అడుగుల రోడ్డుతో ఒకప్పుడు వెలుగొందిన రహదారి కాస్త ఇప్పుడు మూడు మూరలు కూడా లేకపోవటం విశేషం. ఒకప్పుడు ఒక సిటీ బస్సు సులువుగా ప్రయాణం చేసేది. ఇప్పుడు ఒక ఆటో వెళితే ద్విచక్ర వాహనం వెళ్లడం కష్టంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. భూగర్భ విద్యుత్ పేరుతో విద్యుత్ శాఖ రోడ్డు పక్కన పెద్ద పెద్ద డీబీ బాక్సులు బిగించింది. పలు పరికరాలు ప్రమాదకర రీతిలో అమర్చి చేతులు దులిపేసుకుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క వాటిని అనుసరించి చిరువ్యాపారులు తమ వ్యాపారాలను విస్తృత పరుచుకుని వ్యాపారాలు చేసుకుంటున్నారు. రోడ్డుకి ఇరువైపులా ద్విచక్రవాహన చోదకులు పార్కింగ్ చేయడంతో ఈ రోడ్డులో ప్రయాణించాలంటే నరకం కనిపిస్తుందని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పట్టించుకోని అధికారులు..**

రోడ్డును దర్జాగా కబ్జా చేసి వ్యాపారాలు చేస్తున్నా, జీవీఎంసీ సిబ్బంది డస్ట్‌బిన్‌లను రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా ఏర్పాటు చేసినా, రోడ్డుకు ఇరువైపులా ద్విచక్రవాహనాలు, ఆటోలు పార్కింగ్ చేసినా ట్రాఫిక్ పోలీసులు, జీవీఎంసీ అధికారులు పట్టించుకోకపోవడాన్ని వాహనచోదకులు, పాదచారులు తప్పుబడుతున్నారు. గతుకులతో ప్రయాణం చేయడమే కష్టంగా ఉంటే.. ఆక్రమణలు, డస్ట్‌బిన్‌లు, విద్యుత్ డీబీ బాక్సులతో ప్రయాణం ప్రమాదకరంగా మారిందని వాపోతున్నారు. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సంయుక్తంగా డ్రైవ్ నిర్వహించి ఆక్రమణలు తొలగించటమే కాకుండా, డస్ట్‌బిన్‌లు సక్రమంగా ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## 21వ వార్డు ఓటర్ల జాబితా ప్రదర్శన

**దాబాగార్డెన్స్:** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు 21వ వార్డు ఓటర్ల ఫొటో జాబితా సిద్ధం చేశామని జీవీఎంసీ కమిషనర్ పి. రాజాబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవీఎంసీ జోన్-3 పరిధిలోని 21వ వార్డుకు సంబంధించి ఫొటో ఓటర్ల జాబితా రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జోన్-3 కార్యాలయం, ఆర్డీవో, తాసీల్దార్ కార్యాలయాలు, పోస్ట్ ఆఫీసు వద్ద ప్రజల పరిశీలనకు నోటీసు బోర్డులో ఉంచామన్నారు. అలాగే రాజకీయ పార్టీలకు వార్డు ఫొటో ఓటర్ల జాబితా కాపీ పంపించినట్లు కమిషనర్ తెలిపారు.

## ఘనంగా శ్రీకృష్ణ మందిరం వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణలో కృష్ణ భగవానుడు

**కంచరపాలెం:** స్థానిక విఘ్నేశ్వర మహాలక్ష్మి సహిత శ్రీకృష్ణ మందిరం 8వ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం జలాభిషేకం, 108 కలశాలతో క్షీర పంచామృతాభిషేకం, నూతన వస్త్రాలంకరణ, గరికపూసలు, మారేడు దళాలతో సామర్చాన, అన్నాభిషేకాలు, ప్రత్యేక అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. పార్టీలకు అతీతంగా పలువురు రాజకీయ నాయకులు కృష్ణ భగవానుని దర్శించుకుని పూజలు చేశారు. మధ్యాహ్నం సుమారు 2 వేల మందికి భారీ అన్నదాన కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం ఉత్సవ విగ్రహాలకు తిరువీధి ఊరేగింపు నిర్వహించారు. పాలకవర్గం, కార్యవర్గ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు పనులు పర్యవేక్షించారు.

## ఉల్లాసంగా వేడుకలు

**డాబాగార్డెన్స్:** మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని వాసవీక్లబ్-వనిత విశాఖ ఆధ్వర్యంలో మగువా.. మగువా..పేరిట నిర్వహించిన వేడుకలు ఉత్సాహంగా సాగాయి. డాబాగార్డెన్స్‌లో గల అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రం వేదికగా నిర్వహించిన వేడుకల్లో వాసవీక్లబ్..విశాఖ వనితలు పాల్గొని సందడి చేశారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు వివిధ రకాల ఆటల పోటీలు.. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వాసవీ జిల్లా గవర్నర్ కందుల నాగరాజు, సతీమణి నళినీదేవి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. వివిధ రంగాల్లో నిష్ణాతులైన ఐదుగురు మహిళల్ని గ్రంధి మల్లిక మనోజ్, వైశాలి కులకర్ణి, ప్రముఖ జర్నలిస్ట్ రేష్మాజైన్, డాక్టర్ దివ్యా మంచాల, శ్రావణి సత్కరించారు. సర్వీస్ ప్రాజెక్టుగా నస్‌ఫ్లవర్ స్కూల్ పిల్లలకు ఆర్థిక సహకారం, సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌కు ఫ్యాన్లు, లైట్లు, వృద్ధులకు వాసవీ ఆలంబన పేరిట పెన్షన్ అందజేశారు. కార్యక్రమంలో అద్దగళ్ల శ్రీనివాసరావు, సునీతాదేవి, బి. ఉమా మహేశ్వరి, పి. లక్ష్మీగుప్తా, బి. సూర్యకుమారి, ఎం. సుధ, పి. శశికళ, సీహెచ్ రాధిక, పాస్ట్ ప్రెసిడెంట్లు, క్లబ్ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు వద్దు

**తాటిచెట్లపాలెం:** ఆడ పిల్లలకు బాల్యవివాహాలు చేయవద్దని, పిల్లలను పనికి పంపొద్దని దళిత బహుజన రిసోర్స్ సెంటర్(డీబీఆర్‌సీ) సిబ్బంది హితవు పలికారు. 45వ వార్డు ఏఎస్సార్ నగర్‌లో స్థానిక సచివాలయ సిబ్బంది సహకారంతో సోమవారం డీబీఆర్‌సీ సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆడపిల్లలకు 18 ఏళ్లు వచ్చే వరకు వివాహం చేయకూడదని తెలిపారు. డీబీఆర్‌సీ కో ఆర్డినేటర్లు ఎల్.నిఖిల, కె.రాజు, సచివాలయ సెక్రటరీలు బొట్టా దేవి, మహిళా పోలీస్ అనిత, వలంటీర్ ధనలక్ష్మి పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ త్రిఫ్ట్ సొసైటీ సేవలు భేష్



విద్యార్థులకు ప్రోత్సాహకం అందజేస్తున్న సీఎండీ అతుల్ భట్

**ఉక్కునగరం:** స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు త్రిఫ్ట్ సొసైటీ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని సీఎండీ అతుల్ భట్ అన్నారు. త్రిఫ్ట్ సొసైటీ ఆధ్వర్యంలో స్టీల్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో 2020 - 21, 2021 - 22 సంవత్సరాల్లో విద్యలో ప్రతిభ చూపిన 83 మంది విద్యార్థులకు రూ.2.48 లక్షల చెక్కులు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో పోటీ పెరిగి మరింత ఉజ్వల స్థితికి చేరుకుంటారన్నారు. సొసైటీ కార్యదర్శి డి.శ్రీరామచంద్రమూర్తి మాట్లాడుతూ పిల్లలు విద్యలో ప్రతిభ చూపి మరింత రాణించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యక్షులు కె.ఆనందకుమార్ మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి ఓబీసీ కేటగిరీ వారికి ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. డైరెక్టర్లు కె.శ్రీనివాస్, బి.లాలూ, జి.వి.రమేష్, వి.జి.మహీధర్, సీనియర్ మేనేజర్ కె.దామోదర్‌రెడ్డి, స్టీల్ సిటు గౌరవాధ్యక్షులు జె.అయోధ్యరామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ అమ్మవారి తొలేళ్లు



విశేష అలంకరణలో రేణుక ఎల్లమ్మ అమ్మవారు



విద్యుత్ దీపాలంకరణలో అమ్మవారి ఆలయం

**అల్లిపురం:** కెప్టెన్ రామారావు జంక్షన్‌లో వెలసిన రేణుక ఎల్లమ్మ అమ్మవారి వార్షిక జాతర మహోత్సవంలో భాగంగా సోమవారం అమ్మవారి తొలేళ్ల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ గౌరవాధ్యక్షుడు పీల అప్పలనాయుడు, ఆలయ కార్యవర్గ సభ్యులు అమ్మవారికి తొలిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ప్రధాన ఆలయంతో పాటు అచ్చియ్యమ్మపేట వీధులన్నీ విద్యుత్ దీపాలతో అలంకరించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి నీలకంఠం, కార్యదర్శి బొడ్డు పోలరావు పాల్గొన్నారు.



ఉత్సవాలలో భాగంగా అలరించిన కోబ్రా డ్యాన్స్

# కోలా గురువులకు అభినందనలు

**అల్లిపురం:** ఎమ్మెల్సీ అభ్యర్థి కోలా గురువులకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. సోమవారం ఉదయం 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి, వార్డు సీనియర్ నాయకులు లండారమణ, సచివాలయ కన్వీనర్లు రాములమ్మ, సత్తిబాబు, భాస్కరరావు, అప్పలరాజు, వెంకటేష్, సూరిబాబు, జి.అప్పన్న, దేవి, నర్సింగరావు, శ్రీనివాస్ గురువులను ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. శాలువ కప్పి ఆయనను సత్కరించారు. ఈ సందర్భంగా తోట పద్మావతి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేసిన కోలా గురువులు ఎనలేని సేవలందించారని పేర్కొన్నారు. అతని సేవలను గుర్తించిన ముఖ్యమంత్రి తగిన గుర్తింపు అందజేశారన్నారు. ఆయన మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆమె ఆకాంక్షించారు.



కోలా గురువులకు అభినందనలు తెలియజేస్తున్న తోట పద్మావతి

# భూకబ్జాదారుల నుంచి గీత కార్మికులను కాపాడండి

**సీతమ్మధార :** భూకబ్జాదారుల నుండి పాత మధురవాడ అమాయక గీత కార్మికుల కుటుంబాలను కాపాడాలని, బాధితులకు న్యాయం జరిగే వరకు సీపీఐ పోరాటం చేస్తుందని విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు అన్నారు. సోమవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గీత కార్మికులతో కలిసి వారికి మద్దతుగా నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధురవాడలో 40 సెంట్ల జిరాయితీ భూమిని పాత మధురవాడలో నివాసం ఉంటున్న పేద గీత కార్మికుల కుటుంబానికి చెందిన టేకుపూడి పెద్ద అప్పన్న, పీస పైడితల్లి 1957లో కొనుగోలు చేసుకుని జీవిస్తున్నారని అన్నారు. 2021లో కుటుంబ అవసరాల నిమిత్తం ఇందులో 20 సెంట్ల భూమిని ఐదుగురు వ్యక్తులకు అమ్మారన్నారు. మిగిలిన 20 సెంట్ల స్థలంలో గీత కార్మికుల కుటుంబాలు జీవిస్తుండగా 2002లో పోతిన రమణ అలియాస్ పొట్టి రమణ దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకుని కె.శివరామరాజు అనే వ్యక్తికి అమ్మేసారని తెలిపారు. గీత కార్మికులు న్యాయస్థానం, సిట్‌లో ఫిర్యాదు చేయగా ఈ భూమి రైతులకు చెందినదని తీర్పు వచ్చిందన్నారు. అయితే తర్వాత కొందరు బెదిరింపులకు పాల్పడి అమాయక గీత కార్మికులను భయభ్రాంతులకు గురి చేసారని తెలిపారు. గీత కార్మికులకు న్యాయం జరిగే వరకు సీపీఐ వారికి అండగా ఉంటుందని పైడిరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో గీత కార్మికులు టి.అప్పారావు, రమణమ్మ, రాము, జి.అప్పలరాజు, సీతమ్మ, గిరి, కనకం, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎ.విమల, ఎస్‌కే రెహ్మాన్, ఎండీ బేగం, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు, బాధితులు

# కేజీహెచ్‌లో గిరిజన మహిళకు దొరకని బెడ్

- బెడ్ ఇచ్చామంటున్న సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్‌కుమార్



కేజీహెచ్ రాజేంద్రప్రసాద్ వార్డులో నేల మీద పడుకున్న గిరిజన మహిళ



మంచం మీద తల్లిదండ్రులతో కృష్ణవేణి

**మహారాణిపేట:** కేజీహెచ్‌లో గిరిజన మహిళకు బెడ్ కేటాయించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇదే ఆస్పత్రి పిల్లల వార్డులో గిరిజన పసికందు మృతి చెందడం, మృతదేహాన్ని ద్విచక్రవాహనంపై తరలించిన ఘటన మరిచిపోక ముందే మరో గిరిజన మహిళకు బెడ్ ఇవ్వలేదన్న వార్తలు వస్తున్నాయి. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముంచంగిపుట్ మండలం వనగుమ్మ గ్రామానికి చెందిన కె.కృష్ణవేణిని తల్లిదండ్రులు ఈనెల 25న వైద్యం కోసం కేజీహెచ్‌లో చేర్పించారు. దగ్గు, జ్వరంతో బాధపడుతున్న ఆమె ఊపిరితిత్తుల్లో నీరు చేరింది. దీంతో 25న రాత్రి భావనగర్ వార్డులో చేర్పించి చికిత్స అందజేశారు. చికిత్సతో వ్యాధి తగ్గుముఖం పట్టడంతో కృష్ణవేణిని రాజేంద్రప్రసాద్ వార్డు 'డి' బ్లాక్‌కు ఆదివారం తరలించారు. అక్కడ పడకలు ఖాళీ లేవు. మరో మహిళ ఉండే మంచాన్ని కృష్ణవేణికి కేటాయించారు. అంటే ఒకే మంచాన్ని ఇద్దరు ఉపయోగించాలన్న మాట. అయితే ఈ మంచం తీసుకోవడానికి కృష్ణవేణి నిరాకరించారు. అప్పటికే ఆ వార్డులో ఒక మహిళ చనిపోవడంతో కృష్ణవేణి అక్కడ ఉండడానికి నిరాకరించినట్లు బంధువులు తెలిపారు. అయితే కృష్ణవేణి ఆ వార్డులోనే కింద పడుకుని రాత్రి నిద్రించారు. ఈ ఘటనకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. తెల్లవారే సరికి జిల్లాలో వైద్యులు అప్రమత్తం అయ్యారు. ఆగమేఘాల మీద కృష్ణవేణికి మంచం కేటాయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యంగా ఉన్నారని, వార్డులో పడకలు ఖాళీ లేకపోయినా ఆమెకు మంచం ఇచ్చామని కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. రోగిని మంచం మీదకి మార్పు చేస్తున్న సమయంలో ఎవరో ఫొటో తీశారని, ఆమెకు మంచం నిరాకరించినట్టు జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి నిజం లేదని సూపరింటెండెంట్ సోమవారం విడుదల చేసిన ప్రకటనలో వివరించారు.